క్లుప్తంగా

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మరికల్: మండల కేంద్రంలోని యువక మండలి భవనంలో గురువారం వికసిత్ తపాల భారత్ సంకల్ప యాత్ర ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఓపీఎల్ఐ నారాయణగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తపాల శాఖలో అమలు చేస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం వందమందికి పైగా వైద్యా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. శ్రీనివాస్‌కుమార్, తపాల శాఖ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతిని పరిరక్షిద్దాం



ఊట్కూరు: ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని శాస్త్రవేత్త ఉమామహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నపొర్ల, ఊట్కూరు ఉన్నతపాఠశాలలో పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్నప్పటినుంచే ప్రకృతిపై ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. చెట్లను పెంచడంతో పర్యావరణాన్ని పరిరక్షించినవారవుతామని తెలిపారు. అనంతరం పర్యావరణ హిత ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, సురేష్, ఏఎంఓ విద్యాసాగర్, ఉపాధ్యాయుల బృందం నర్సింహ, కృష్ణమ్మ, భాస్కర్, అశోక్ పాల్గొన్నారు.

జనవరి 27న ఎమ్మార్పీఎస్ సదస్సు



మద్దూరు: జనవరి 27న మహబూబ్‌నగర్ అంబేద్కర్ కళాభవన్‌లో ఎమ్మార్పీఎస్ టీ-ఎస్ సదస్సు నిర్వహించనున్నట్లు ఈ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేపోగు శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడూతూ.. ఎస్సీ వర్గీకరణ అంశంపై జిల్లాస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మైబన్న, కృష్ణ, క్రాంతి, చిన్న, దోరేప్ప, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన చెట్ల లెక్కింపు



మాగనూర్: భారత్‌మాల రోడ్డు విస్తరణలో భాగంగా గురువారం మండల పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను ఫారెస్ట్ అధికారి నిలేష్‌తో కలిసి భారత్ మాల సైట్ ఇంజనీయర్ నరేష్‌కూమార్ కొలతలు వేసి మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా ఇంజనీయర్ నరేష్‌కూమార్ మాట్లాడుతూ.. వాహనదారుల సౌలభ్యంకోసం నూతనంగా మరికల్ మండలం లాల్‌కోట నుంచి కృష్ణామండలం చెక్‌పోస్ట్‌వరకు నిర్మించనున్న భారత్‌మాల రహదారిలో భాగంగా తొలగించనున్న రోడ్డుకు ఇరువైపులా చెట్లను కొలతలు వేసి రికార్డులు నమోదుచేస్తున్నట్లు తెలిపారు.

మొగుల్‌మడ్కను మండలం చేయాలి

దామరగిద్ద: ప్రజా పాలన సౌలభ్యం కోసం మొగుల్‌మడ్కను మండలంగా ఏర్పాటు చేయాలని స్థానిక గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. గోపాల్, బాల్‌రాజ్, నర్సింహులు, వెంకటేష్, నారాయణ జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు గోపాల్, బాల్‌రాజ్, నర్సింహులు, నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లీనరీలో పాల్గొన్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: నాగపూర్‌లో ఏఐసీసీ ప్లీనరి సమావేశంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతోపాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వినోద్‌చారి ఉన్నారు. ప్లీనరీలో పార్టీ కార్యక్రమాలపై ఎంపీ ఎలక్షన్‌లో కార్యకర్తలు గెలుపుకోసం కృషిచేయాలని తెలిపారు.



కొల్లంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ



ఊట్కూరులో దరఖాస్తులు పరిశీలస్తున్న ఎంపీడీఓ



మరికల్‌లో



నర్వలో దరఖాస్తులను పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

ప్రజాపాలనకు దరఖాస్తుల వెల్లువ

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు చేపట్టడంతో అందుకు అర్హులైన లబ్ధిదారులనుంచి గురువారం ప్రారంభించిన దరఖాస్తుల స్వీకరణకు మంచి స్పందన వస్తుంది. తొలిరోజు మండలంలో నాలుగు గ్రామాల్లో చేపట్టగా 1737కుటుంబాలు దరఖాస్తులను అధికారులకు అందించారు. కొల్లంపల్లిలో 1010, కోటకొండలో 534, వందర్‌గుట్టతండాలో 92, మీదితండాలో 101 దరఖాస్తులు వచ్చాయి. ఆయా జీపీల్లో ఎంపీడీఓ వెంకటయ్య, తహసీల్దార్ రాజాప్రతాప్, వ్యవసాయశాఖ అధికారి శరత్‌చంద్ర, డిప్యూటీ తహశీల్దార్ నారాయణ, ఎంపీఓ బాలాజీలు పర్యవేక్షించారు. కొల్లంపల్లిలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన మహిళలను కలుసుకుని వారి సందేహాలు నివృత్తి చేశారు. అలాగే మండలంలోని కొల్లంపల్లి జెడ్పీఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నర్వ: ప్రజాపాలనలో భాగంగా మొదటిరోజు మండల కేంద్రంలో దరఖాస్తుల స్వీకరణ ప్రశాంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అధికారి డీఎల్‌పీఓ సుధాకర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని సాయంత్రం వరకు పర్యవేక్షించారు. మొత్తం 853దరఖాస్తులు ప్రజలు అందించినట్లు ఎంపీడీఓ సుదర్శన్ తెలిపారు. ఈ దరఖాస్తుల కార్యక్రమం సవ్యంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అధికారులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దింటి సంధ్య, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శరణప్ప, వెంకటేశ్వర్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని కున్సి, గుడెబల్లూర్ గ్రామాల్లో గురువారం నిర్వహించిన ప్రజాపాలనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గుడెబల్లూర్‌లో ఎంపీడీఓ యశోద, కున్సిలో తహసీల్దార్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మదన్‌మోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చక్రపాణి, పంచాయతీ కార్యదర్శులు తిమ్మప్ప, నర్సింహారెడ్డి, సర్పంచ్ శంకరమ్మ, ఆంజనేయులుగౌడ్, సర్పంచ్ మహాదేవమ్మ, పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ఐదు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులకు అందజేశారు. మీ సేవా కేంద్రాల్లో జిరాక్స్ దరఖాస్తు ఫారాలను రూ. 50 విక్రయిస్తున్నారని లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సునిత ఆదేశాల మేరకు పోలీసులతోపాటు సిబ్బందితో మీసేవ, జిరాక్స్‌కేంద్రాలను పరిశీలించారు.

మాగనూర్: గురువారం మండల కేంద్రంలో ఎంపీపీ శ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేరకు.. మండలంలోని 327, వడ్వాట్ 365, నేరడగంలో 801దరఖాస్తులను స్వీకరించినట్లు మండల ప్రత్యేక అధికారి కృష్ణవారి తెలిపారు. ఎంపీడీవో శశికళ, తహసీల్దార్ సతీష్‌కూమార్, డీటీ అమీర్, వైస్ ఎంపీపీ తిప్పయ్య, ఎంపీవో జైపాల్‌రెడ్డి, ఆర్ఐ శ్రీశైలం, సర్పంచ్‌లు అశోక్‌గౌడ్, రాజు, ఆనంద్‌గౌడ్, వాకిటి శ్రీనివాసులు, ఆంజనేయులు, పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని ఊట్కూరు, సమస్తాపూర్, ఎర్గట్‌పల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని స్థానిక గ్రామ పంచాయతీ వద్ద పది టేబుళ్లు ఏర్పాటుచేసి ఆరు గ్యారంటీల దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డీపీఓ మురళీ, ఎంపీడీఓ రమేష్, ఏఓ గణేష్‌రెడ్డి, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



అధికారులతో వివరాలు సేకరిస్తున్న అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

మద్దూరు/ ధన్వాడ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్ ప్రజలకు సూచించారు. గురువారం మద్దూరు, రెనివట్ల, సీత్యానాయక్‌తాండా, సాపన్‌చెరువు తాండాల్లో ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు తీసుకున్నారు. మండలంలోని ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ ముఖ్యమంత్రి సందేశం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ అశోక్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జ్యోతి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, సర్పంచ్ అరుణ పాల్గొన్నారు. ప్రజాపాలన దరఖాస్తులు తొలిరోజు 1642 వచ్చాయని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మద్దూరులో 965, రెనివట్లలో 595, సీత్యానాయక్ తాండా 41, సాపన్‌చెరువు తాండాలో 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ధన్వాడ మండలంలోని గురువారం పంచాయతీ కార్యాలయంలో ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ మాయంకు మిట్టల్ సాయంత్రం సందర్శించారు.

ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి..

దామరగిద్ద: ఆరుగ్యారంటీలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరిస్తుందని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మండల ప్రత్యేకాధికారి డీఆర్‌డీఓ గోపాల్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని కాన్‌కుర్తి, దామరగిద్ద, యల్సన్‌పల్లి అయ్యవారిపల్లి గ్రామాల్లో మొదటి రోజు ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. కాన్‌కుర్తిలో దరఖాస్తుల స్వీకరణనుఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండలంలోని 1636దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

ధన్వాడ: మండలంలోని గురువారం స్థానిక పంచాయతీలో ఏర్పాటుచేసిన ప్రజ పాలనలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పాల్గొని మాట్లాడారు. మొదటిరోజు 1693 దరఖాస్తులు స్వీకరించారు. సమావేశంలో ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ సింధుజా, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఈ ప్రవీణ్ ఉన్నారు.

మరికల్: అర్హులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మండలంలోని గురువారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మొదటి ఐదు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునిత, ఎంపీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ గోవర్ధన్, ఎంపీటీసీ గోపాల్, నాయకులు సూర్యమోహన్, హరిష్, వీరన్న, రాములు, రామకృష్ణ, కృష్ణయ్య, మొగులప్ప పాల్గొన్నారు.



మరికల్‌లో ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ఇంటింటా సౌభాగ్యం



మంతన్‌గోడ్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ

మక్తల్: ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందని, సంక్షేమ పథకాలు అర్హులందరూ ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ అన్నారు. గురువారం మండలంలోని మంతన్‌గోడ్‌లో ప్రజాపాలనను ఆమె ప్రారంభించి మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మరుసటిరోజే మహిళలకు ఉచితంగా బస్సుప్రయాణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ప్రతి మండలంలో వంద మందికి కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ మీమీ గ్రామాల వాడలో జరిగే గ్రామసభలో అధికారులకు దరఖాస్తులు అందించాలన్నారు. మండలంలోని జక్లేర్‌లో 481, మంతన్‌గోడ్ 393, పస్పుల 180, యర్నాగన్‌పల్లి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జాన్‌సుధాకర్, ఎంపీపీ వనజ, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ సద్గుణ, ఎంపీఓ రహిమతుల్లా, సర్పంచ్ నర్సింహులు, పస్పుల సర్పంచ్ దత్తు, ఎంపీటీసీ పారిజాత, మంతన్‌గోడ్‌సర్పంచ్ మహదేవమ్మ, డీటీ లత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహాపడిపూజ



స్వామివారి కలశ ఊరేగింపు

దామరగిద్ద: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని ప్రత్యేక రథంలో శోభయాత్ర, కలస ఊరేగింపు నిర్వహించారు. అనంతరం స్థానిక భవాని ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన పూజ మంటపానికి చేరుకొని అభిషేకం మహామంగళహారతి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి పూజల్లో పాల్గొని ప్రత్యేక భ భజనలు చేశారు. భక్తుల అయ్యప్ప నామస్మరణతో మాగర్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గురుస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా గూళ్ల నర్సింహ

మద్దూరు: దమ్‌గాన్‌పూర్ సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా మోమినాపూర్ డైరెక్టర్ గూళ్ల నర్సింహను డైరెక్టర్లు ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కో ఆపరేటీవ్ అధికారి కొదండరాములు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నిడ్జింత డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్ ఎన్నికకోసం నర్సింహ పేరును ప్రతిపాదించగా తిమ్మారెడ్డిపల్లి డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి బలపర్చారు. మిగిలిన సభ్యులందరు సమ్మతించడంతో నర్సింహ దమ్‌గాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కొండడరాములు ప్రకటించారు. అనంతరం నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు..



నియమాకపత్రాన్ని అందజేస్తున్న డీసీఓ కొండద రాములు

నూతనంగా ఎన్నికైన నర్సింహ మాట్లాడుతూ.. ఈ సహకార సంఘం ద్వారా రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక



మాగనూర్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో మండల నూతన ఆర్యవైశ్య కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా మండల ఆర్యవైశ్యసంఘం నూతన అధ్యక్షుడిగా ఓబుల శెట్టి రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌కూమార్, మురళీమోహన్‌తో పాటు మరో 12మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షుడు రవి ప్రకాష్ మాట్లాడుతూ.. ఆరవైశ్య సంఘం అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు రాంగోపాల్‌శెట్టి, ఉదయ్‌కూమార్, వాబయ్య, రాఘవేంద్ర, నర్సింహులు, శివలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మాగనూర్: మండల పరిధిలోని పర్మన్‌డొడ్డి శివారులో పేకాట ఆడుతున్నట్లు స్థానికుల సమాచారం మేరకు.. ఎస్ఐ మల్లేష్ తన సిబ్బందితో కలిసి దాడులు చేయగా పేకాట ఆడుతూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. అదేవిధంగా రూ. 6200నగదు, 11ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మిగతా వ్యక్తులు పరారీలో ఉన్నారని ఈ విషయంపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళాజాత బృందం

నర్వ: సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కళాజాత బృందం, సభ్యులు సురేందర్‌గౌడ్ అన్నారు. గురువారం ఉందేకోడ్ జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట, పాటల ద్వారా అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలను ఎవరైనా లైంగికంగా వేదింపులకు పాల్పడితే, ర్యాగింగ్ చేసిన వెంటనే ధైర్యంగా పోలీస్‌లకు సమాచారం అందిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టోల్‌ఫ్రీనెంబర్ 1930, 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. తోటి విద్యార్థులు స్నేహంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ కలిగి ఉండాలన్నారు. క్రమ శిక్షణతో వివిధ రకాల పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యానాయక్, హెచ్‌ఎం కోట్ల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సులతో జీవనోపాధి

కోస్గి: విద్యార్థులు ఒకేషనల్ కోర్సులు చదవడంతో స్వయంగా జీవనోపాధి పొందొచ్చునని స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్స్ ప్రశాంతి, జ్యోతి సూచించారు. ఈ మేరకు గురువారం ఒకేషనల్ కోర్సులో భాగంగా విద్యార్థులకు కొడంగల్ పట్టణంలోని ఆంధ్రా బ్యాంక్‌ను ప్రత్యేక్షంగా పరీక్షించి అవగాహన కల్పించారు. బ్యాంకుల ద్వారా వినియోగదారులకు అందుతున్న సేవలు, రుణాలు, వడ్డీల వివరాలు, ఆధార్ అనుసంధానంతో ప్రయోజనం, బ్యాంక్ ఆన్‌లైన్ సేవలు తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలంపాట

ఆత్మకూర్: ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పలు దాడుల్లో పట్టుబడ్డ వాహనాలకు గురువారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలో వేలంపాట నిర్వహించారు. రెండు కార్లు, మూడు బైక్‌లకు రూ. 50వేలు ధర నిర్ణయించగా వేలంలో రూ. 1.11లక్షల ఆదాయం సమకూరిందని తెలిపారు. 12 మంది డిపాజిట్లు చెల్లించి వేలంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. అక్రమంగా సారా, బెల్లం, నవసాగరం ఇతర నిషేధిత వస్తువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

కార్యక్రమంలో సీఐ బాలరాజు, ఎస్ఐ వెంకటేష్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



మాగనూర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట: కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సంకల్పబలంతో కార్యకర్తలు పార్టీ నాయకులు సమిష్టి కృషితోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ఘన విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, మాజీ ఎంపీపీ సదాశివారెడ్డి, కౌన్సిలర్ సలీం, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్.మనోహర్‌ప్రసాద్‌గౌడ్, సంతోష్, హన్మంతు, లిఖిరఘుబాబు, రమేష్, యూసుప్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలెపి గురువారం కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొగ్దుంపుర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బషీర్ అహ్మద్, యజ్ఞదత్తు, కొక్కు శంకర్, రవికుమార్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని గురువారం బస్‌స్టాండ్ స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల కోసం ప్రభుత్వం ఆరు గ్యారంటీలను తీసుకొచ్చిందని నాయకులు నరేందర్‌గౌడ్, రఘువేందర్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, ఇసాక్, లక్ష్మయ్య, మల్లేష్, యుసుఫ్, జమిల్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల పరిధిలోని నల్లగట్టు వద్ద గురువారం కాంగ్రెస్ ఆవిర్బవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. పార్టీ జెండాను మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు.. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, శివరాంరెడ్డి, ఆనంద్, వాకిటి శ్రీనివాసులు, వేణు, గడ్డం నరేష్, చక్రపాణిరెడ్డి, దండు సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూరులో జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ధన్వాడలో

దరఖాస్తుపత్రాలు పూర్తిగా ఉచితం: కమిషనర్

ఆత్మకూర్: ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన దరఖాస్తుపత్రాలను పూర్తిగా ఉచితంగా ఇస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు గురువారం ప్రకటనలో తెలిపారు. జిరాక్స్ కేంద్రాల్లో ప్రజాపాలన దరఖాస్తులను రూ.10కి అమ్ముతున్నట్లు తమకు సమాచారం వచ్చిందని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద దరఖాస్తు పత్రాలను ఉచితంగా ఇస్తున్నామని ప్రజలు కేవలం ఫొటో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్సు ప్రతులను మాత్రమే తీసుకురావాలని సూచించారు.

కార్మికుల పక్షాన ఏఐటీయూసీ

ఆత్మకూర్: రాష్ట్రంలో కార్మికుల పక్షాన ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తోందని జిల్లా కార్యదర్శి మోష, సీపీఐ మండల కార్యదర్శి రాబర్ట్ అన్నారు. గురువారం పట్టణంలో ఏఐటీయూసీ కార్మికుల సమావేశం నిర్వహించారు.